ప్రయాణం.. నరకప్రాయం

- గుంతలమయంగా పారిశ్రామిక రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గడ్డపోతారం పారిశ్రామికవాడలో రోడ్డు దుస్థితి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పారిశ్రామికవాడల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు పారిశ్రామికవేత్తలు, అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని పారిశ్రామికవాడల ప్రజలు వాపోతున్నారు. జిన్నారం మండల పరిధిలోని బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఇక వర్షాకాలంలో అయితే రోడ్లపై ప్రయాణించాలంటే నరకం అనుభవించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు

మండలంలోని ఆయా పారిశ్రామికవాడల్లో 100పైగా వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సుమారు 12,000 మందికిపైగా కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం ఈ రోడ్లపై భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో కార్మికులు, ఉద్యోగులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని పారిశ్రామికవాడల్లో రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీకి ఏడాదికి సుమారు రూ.12కోట్ల ఆదాయం ఉంటుంది. మున్సిపల్ అధికారులు పరిశ్రమల నుంచి ప్రతి ఏటా పన్నులను వసూలు చేస్తుంటారు. కానీ.. రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకపోవడంతో మున్సిపల్ ఆదాయం ఎటుపోతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశ్రామికవాడల్లోని రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

> **మరమ్మతులు చేపట్టాలి**
>
> ప్రారిశ్రామికవాడల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఎన్నోసార్లు ఆందోళనలు చేపట్టాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు వేయించాలి.
>
> **– రాజయ్య, సీఐటీయూ నాయకుడు**

క్లుప్తంగా

బోనాల వేడుకల్లో రాజనర్సింహ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దామోదర రాజనర్సింహ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బోనాల వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అవినాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడ్గిలో రైతుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని కొత్తూర్‌లో చక్కెర ఫ్యాక్టరీ మూతపడకుండా పోరాటం చేయాలని టీజేఎస్ నాయకుడు మొగుడంపల్లి అశప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశప్ప మాట్లాడుతూ ఈ నెల 18న జహీరాబాద్‌లో రైతులు, కార్మికులతో కలిసి మహాదీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దీక్షను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



చంద్రయ్య, సీఐ

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ సీఐగా చంద్రయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ, మల్టీజోన్–2 నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇంత కాలం ఇక్కడ సీఐగా పనిచేసిన సంతోష్‌కుమార్ సంగారెడ్డిలోని ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

సదాశివపేట(సంగారెడ్డి): రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ సహకారంతో పట్టణ, మండల పరిధిలోని యువతి, యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్సు పొందుటకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ యువత అధ్యక్షుడు బీట్ల ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో యువతి యువకులు ఆధార్‌కార్డు, ఎస్‌ఎస్‌సీ సర్టిఫికెట్, పాన్‌కార్డు, ఓటరు ఐడీకార్డు, రెండు పాస్‌ఫొటోలతో సంప్రదించాలన్నారు. ఈ నెల 19వ తేది నుంచి 29 వరకు అవకాశం ఉందని సూచించారు.

సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందంజ



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

వట్‌పల్లి(అందోల్): అన్ని వర్గాల వారికి సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని డిస్ట్రిక్ మాజీ గవర్నర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వట్‌పల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం లయన్స్ క్లబ్ నూతన మండల అధ్యక్షుడిగా వైద్యసాగర్, కార్యదర్శిగా కిషన్‌రావు, ట్రెజరర్‌గా చంద్రశేఖర్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ జాయింట్ డిస్ట్రిక్ క్యాబినేట్ సెక్రటరీ డాక్టర్ అనంతరెడ్డి, మాజీ జోనల్ చైర్మన్ రాంబాబు, రిజియన్ చైర్మన్ శంకర్, జోన్ చైర్మన్ పెద్దన్న, రాజ్‌కుమార్, రీజియన్ కార్యదర్శి దిగంబర్‌రావు, సభ్యులు మోయినోద్దీన్, సిద్దేశ్వర్, రమేశ్‌జోషి, దిగంబర్‌రావు, మోసీన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో చింతలచెరువు భక్తుల భజన



హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని చింతలచెరువు గ్రామానికి చెందిన హనుమాన్ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతిలో వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం హరినామ సంకీర్తన నిర్వహించారు. కొన్ని సంవత్సరాల నుంచి హనుమాన్ దేవాలయ భజన మండలి ఏడాదికోసారి తిరుమల దేవస్థానంలో భజన సంకీర్తన కార్యక్రమాలను నిర్వహిస్తుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విభజన సంకీర్తనల్లో హనుమాన్ దేవాలయం భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.



ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలోని పోచమ్మతల్లిని ఆదివారం రాత్రి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, శంకర్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యాదగిరి

కొండాపూర్(సంగారెడ్డి): భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని రైతుబజార్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ యూనియన్ నాయకులు, పెంటయ్య ముత్యాలు, సంగమేశ్వర్ రాజేష్, మొగులయ్య, యాదయ్య దుర్గయ్య, రత్నం, రాములు రాజు, పాల్గొన్నారు.

సన్మానం

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల నూతన ఎస్‌ఐగా వచ్చిన చేతన్‌రెడ్డిని అంబేడ్కర్, పూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు రహీం, ప్రధాన కార్యదర్శి పండరీలు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు భీమసేన, డివిజన్ నాయకులు కొటారి నర్సింహులు, నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడు కర్ర రమేశ్, నాయకులు శంకర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరికలు



పార్టీలో చేరినవారితో బీఎస్పీ నాయకులు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని గౌడ్‌గాంజన్‌వాడకు చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో నుంచి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి బోర్గి భీమన్న, అధ్యక్షులు పుప్పాల అశోక్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో మేత్రి సీమన్‌ను పార్టీ గ్రామ అధ్యక్షుడిగా నియమించారు. పార్టీ ఖేడ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డేవిడ్, మనూరు మండలశాఖ అధ్యక్షుడు అనుముల తుకారాం, కంగ్టి అధ్యక్షులు సాయిలు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచందుకు చౌట్కూర్ మండలం దళిత నాయకులు ఘన నివాళి అర్పించారు. గురువారం హైదరాబాద్‌లోని సాయిచంద్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాజు, సంతోష్,మాణిక్ తదితరులు ఉన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



పటాన్‌చెరు: ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రంగయ్య శెట్టి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.90వేల ఎల్‌ఓసీ సోమవారం రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలంలోని రాయిపల్లికి చెందిన అహ్మద్ హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. చికిత్సల నిమిత్తం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సిఫార్సుతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు జానిపటేల్, మాషుపటేల్, అబేద్, సంజీవ్‌పటేల్, శివరాజ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించడం తగదు



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విమర్శించడం తగదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డిపై చేస్తున్న విమర్శలను ఖండిస్తూ సోమవారం పట్టణంలో ఆ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సమైక్య పార్టీలకు ఊడిగం చేసిన వాళ్లు కొంతమంది కాంగ్రెస్ ద్వారా ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యేలు పదవులు పొంది నేడు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. రైతాంగానికి, పరిశ్రమలకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం అని చెప్పుకునే బీఆర్‌ఎస్ నేతలతో చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. ఈ నెల 18న మంగళవారం ఉదయం 11గంటలకు పటాన్‌చెరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి విద్యుత్ పంపిణీపై అధికారులను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు హనిబ్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, హమిత్ పాష, ఉమ్మర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



కొండాపూర్: మాట్లాడుతున్న సాయిలు

కంది(సంగారెడ్డి): మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కాశిపూర్ మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, రాములు, నాయకులు నర్సింలు, యాదయ్య, లింగం, సదానందం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): మిషన్ భగీరథ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మిషన్ భగీరథ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మిషన్ భగీరథ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రాములు జిల్లా నాయకులు రాములు, కృష్ణ, ప్రభాకర్, వెంకటేష్, నర్సింలు, బిచ్చయ్య, మల్లేష్ పాల్గొన్నారు.



కంది: మాట్లాడుతున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

◆ రుద్ర చండీయాగం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని పసల్వాది శివారులోని జ్యోతిర్‌వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా సోమవారం విద్యాపీఠ వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో రుద్ర చండీయాగం నిర్వహించారు. అదేవిధంగా ఆశ్రమంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలకు మహాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ సిద్దేశ్వర ఆలయంలో భక్తుల సందడి



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్గోల్ రోడ్డులోని సిద్ధేశ్వర ఆలయంలో సోమవారం అవాస్య పురస్కరించుకుని స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం, ఆలయ అభివృద్ధి పనులకు విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్, సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేధారినాథ్ పాటిల్, ఆలయ, ఆత్మ కమిటీల చైర్మన్‌లు సంగమేశ్వర్ పాటిల్, విఠల్, ఆలయ పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ శుభప్రదం.. పురుషోత్తమ మాసం

నారాయణఖేడ్: పురుషోత్తమమాసం శుభప్రదమని అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్ అన్నారు. పురుషోత్తమ మాసం పురస్కరించుకొని సోమవారం నారాయణఖేడ్‌లోని కల్పనా హనుమాన్ ఆలయంలో హరివిజయ, నవనాథ పురాణ పఠనాన్ని ప్రారంభించారు. దత్తు మహారాజ్, మోహన్ జ్యోషి, సంగారెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి స్వర్ణామృత ప్రాస చుక్కల పంపిణీ

జహీరాబాద్ టౌన్: శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులతో ఈ నెల 18 నుంచి పిల్లలకు స్వర్ణామృత ప్రాస చుక్కల మందు పంపిణీ చేయనున్నట్లు వికాస తరంగిణి జహీరాబాద్ అధ్యక్షుడు అల్లాడి వీరేశం తెలిపారు. ఆరు రోజుల పాప నుంచి 16 సంవత్సరాల వయసు కలిగిన వారికి చుక్కల మందు వేస్తామని తెలిపారు. పట్టణంలోని బ్లాక్ రోడ్డులోని శ్రీదత్తసాయి పిల్లల ఆస్పత్రిలో మంగళవారం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

◆ ఆర్థికసాయం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన అవుసలి శ్రీశైలం, ఎర్కల రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఆర్థికసాయం అందజేశారు.

◆ రేపటి నుంచి అఖండ హరినామ సప్తహా

నారాయణఖేడ్: మార్వాడీగల్లీలోని కాశీనాథ్ మందిరంలో అధిక శ్రావణమాస పర్వకాలాన్ని పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు అఖండ హరినామ సప్తహా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ నేడు రైతులతో సమావేశాలు

రాయికోడ్(అందోల్): మండలంలోని రైతువేదికల్లో మంగళవారం రైతులతో ఏర్పాటు చేసే సమావేశాలకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరవుతారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్ పాటిల్, శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాపూర్, ఇటికేపల్లి, హుల్గేర, రాయికోడ్, పీపడ్‌పల్లి, ఔరంగానగర్, సింగితం రైతువేదికల్లో సమావేశాలు ఉంటాయన్నారు.

◆ ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

వట్‌పల్లి(అందోల్): పట్టణంలో ముత్యాలమ్మ (వదినలమ్మ) ఆలయ ఆలయ 25వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గణపతి హోమం, ముత్యాలమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, నూతన వస్త్రాలంకరణ చేసి, అమ్మవారిని పూలు నిమ్మకాయల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ధర్నాకు తరలిరావాలి

నారాయణఖేడ్: టీఆర్టీ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ చైర్మన్ భీంరావునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు అధికసంఖ్యలో పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

◆ సన్మానం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్ బోడగామ నాగభూషణంను మంగళవారం వీరశైవ చౌకిమఠం సమాజం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వీరశై సమాజం చౌకిమఠం అధ్యక్షుడు చీలమల్లన్న, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు పాల్గొన్నారు.

◆ బకాయిలు చెల్లించాలి



జహీరాబాద్ టౌన్: చెరకు రైతులకు బాకాయిలు వెంటనే చెల్లించాలని బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జి సిద్దురావణ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ట్రిడెంట్ కర్మాగారానికి సరఫరా చేసిన చెరకు పంట పూర్తి బిల్లులను నేటివరకూ యాజమాన్యం చెల్లించలేదన్నారు. యాజమాన్యం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలరన్నారు.